దాహార్తి తీర్చే చలివేంద్రాలు

- పలు సర్కిళ్లలో ప్రారంభం
- ఏర్పాటుకు ముందుకొస్తున్న దాతలు

చలివేంద్రం ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, ఏప్రిల్ 7: పాదచారుల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని బీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు కార్యాలయం వద్ద ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు విజయ్‌పద్మనాభన్ స్నేహితులతో కలిసి అదివారం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రేమ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండలు తీవ్రం అవుతున్న తరుణంలో దప్పికతో ఉన్న ప్రజల కోసం చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీజేఎంసీ ఆల్‌కాలనీస్ ఫేడరేషన్ సభ్యులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌గూడ చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అత్తాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు

హైదర్‌గూడ చౌరస్తాలో...

అత్తాపూర్: పెరుగుతున్న ఎండల తీవ్రతతో ప్రజలు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అత్తాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరామ్‌రెడ్డి అన్నారు. హైదర్‌గూడ పీవీ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 143 వద్ద హుడా పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శ్రీరామ్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జగ్గు భాయ్, కన్నాబాబు, ప్రజాపతి, సంజు మాస్టర్, అంబదాస్, జైహింద్‌రెడ్డి, ఫన్నాలాల్, సంతోష్, శంకర్ తదితరులున్నారు.

మల్రిచెట్టు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్

మణికొండలో మజ్జిగ కేంద్రం...

మణికొండ: ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మల్రిచెట్టు సర్కిల్‌లో లక్ష్యా ఫుడ్‌వేస్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి హాజరై మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సి.బీరప్ప, ఎం.రాఘవరెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, బి.రవికాంత్‌రెడ్డి, రాజేశ్, మధు, శివ రాంరెడ్డి, కౌన్సిలర్ పురుషోత్తం, ముత్యాలు, కిరణ్‌కుమార్‌గౌడ్, మహేశ్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఏప్రిల్ 7: గుడిలోకి ప్రవేశించి చోరీకి యత్నించిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 13లోని నల్లపోచమ్మ ఆలయంలో శనివారం రాత్రి 11.30 ప్రాంతంలో ఓ వ్యక్తి గుడి ప్రహరీ దూకి లోనికి ప్రవేశించాడు. ఆలయ గ్రిల్స్ కట్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అలికిడికి స్థానికులు అప్రమత్తమయ్యారు. ఆలయ కమిటీ సభ్యుడు సతీశ్‌కు విషయం చెప్పగా స్థానికులతో కలిసి అక్కడకు వచ్చారు. దీంతో చోరీ చేసేందుకు వచ్చిన వ్యక్తితో పాటు అతడితో ఉన్న మరో వ్యక్తి పారిపోయేందుకు యత్నించగా పట్టుకున్నారు. వారివద్ద 4 యాక్సా బ్లేడ్లతో పాటు ఇతర సామగ్రి దొరికింది. చోరీకి వచ్చినట్లు గుర్తించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చోరీకి యత్నించిన వ్యక్తి సిద్దిపేటకు చెందిన సెంట్రింగ్ వర్కర్ జి. నరేందర్(22), రాజు(21) అని తేలింది. వీరిపై సతీశ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఐపీసీ 457, 380 రెడ్‌విత్ 511 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రారంభానికి సిద్ధం.. అంతలోనే అగ్నిప్రమాదం

బండ్లగూడ, ఏప్రిల్ 7: వారంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సూపర్ మార్కెట్‌లో మంటలంటుకొని ఆస్తి నష్టం జరిగింది. ఈ సంఘటన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జిల్లా అసిస్టెంట్ ఫైర్ అధికారి గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారి వెంట ఉన్న రత్నదీప్ సెలక్ట్ సూపర్ మార్కెట్ నూతనంగా ఏర్పాటు కోసం రూపుదిద్దుకుంటుంది. ఆదివారం ఉదయం ఆ సూపర్ మార్కెట్లో ఒక్కసారిగా దట్టమైన పొగలు అలుముకుని మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారంతో ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకుని రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని ఆయన తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండవచ్చని తెలిపారు. ఘటనా స్థలాన్ని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పరిశీలించారు.

లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందాలి

ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు మొక్కను అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ హేమలత

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 7: బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ జన్మదినం సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ భవన్‌లో పద్మారావుగౌడ్‌ను మాజీ కార్పొరేటర్ జె.హేమలతయాదవ్, బీఆర్ఎస్ నేత జె.బాబుయాదవ్ కలిసి మొక్కను అందించి శుభకాంక్షలు తెలిపారు. పద్మారావుగౌడ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందాలని వారు ఆకాంక్షించారు.

సోదర భావాన్ని పెంపొందించే ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో పాల్గొన్న వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య, తదితరులు

వెంగళరావునగర్, ఏప్రిల్ 7: ఇఫ్తార్ విందులు సోదర భావాన్ని పెంపొందిస్తాయని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య అన్నారు. ఆదివారం మధురానగర్‌కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో ముస్లింసోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నియమ నిష్ఠలతో అల్లాపై విశ్వాసం ఉంచి స్వయంగా ఆమె కూడా ఆదివారం ఉపవాస దీక్షను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన ముస్లిం మత పెద్దలు బీఆర్ఎస్ నాయకులు జహంగీర్, జుబేర్, సల్మాన్, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరల సమస్యలు పరిష్కరించాలి

బీఆర్ఎస్ నేతలను కోరిన వడ్డెర సంక్షేమ సంఘం నేతలు


సమస్యలను పరిష్కరించాలని పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం సంఘం నేతలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 7: రాష్ట్రంలో వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. సికింద్రాబాద్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌తో పాటు ఇతర నాయకులకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్.ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు వరికుప్పల కుమార్ ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో వడ్డెరలు ఎస్సీ జాబితాలో ఉన్నారన్నారు. రాష్ట్రంలోని సుమారు 40లక్షల మంది వడ్డెర కులస్తులు ఉన్నారని, వారిలో అత్యధికంగా అనేక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. వడ్డెరల సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీకుటీర్ బస్తీ అధ్యక్షుడిగా తోట శివకుమార్

విజయం సాధించిన శివకుమార్‌ను అభినందిస్తున్న స్థానికులు

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 7: నారాయణగూడ, గాంధీకుటీర్ బస్తీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తోట శివకుమార్‌ముదిరాజ్ విజయం సాధించారు. మొత్తం ఓట్లు 763 ఉండగా 578 పోలయ్యాయి. అధ్యక్ష పదవికి పోటీచేసిన శివకుమార్‌కు 277, రాజేంద్ర ప్రసాద్‌కు 236, నీలం శ్రీనివాస్‌యాదవ్‌కు 61 వచ్చాయి. నాలుగు ఓట్లను తిరస్కరించారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. సాయంత్రం 6 గంటలకు ఓట్లను లెక్కించారు. రాజేంద్రప్రసాద్‌పై 41 ఓట్ల మెజార్టీతో శివకుమార్ గెలుపొందారు. విజేతను బస్తీవాసులు ఐలమ్మ, సంధ్యారాణి, కిరణ్, లావణ్య, కృష్ణ గౌడ్ తదితరులు శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 7: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించే సమయం ఆసన్నమైందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం వల్ల ఆయా రంగాల్లో పనిచేసే కార్మికులకు సామాజిక భద్రత, కనీస వేతనాలు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న 44చట్టాలను సవరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 4 కోడ్‌లను మోదీ తీసుకువచ్చారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హటావో-దేశ్‌కి బచావో అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి బీజేపీని ఓడించడమే లక్ష్యంగా కార్మికులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రత్నాకర్ రావు, పి.ప్రేంపావని, నాయకులు ఎస్.విలాస్, పల్లాదేవేందర్, ఓరుగంటి యాదయ్య, కరుణకుమారి, బి.వెంకటేశం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేత నవీన్‌యాదవ్



జూబ్లీహిల్స్, ఏప్రిల్ 7: యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వల్లాల గ్రౌండ్‌లో నేడు సాయంత్రం నిర్వహించనున్న ఇఫ్తార్ విందుకు సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్‌యాదవ్ ఆదివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎంకు మొక్కను బహుకరించారు.

యువకుడు అదృశ్యం

అవినాశ్ (ఫైల్)

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 7: యువకుడు అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాసరావు కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా తేజాపూర్ విలేజ్‌కి చెందిన అవినాశ్ (26) గత కొన్ని రోజుల క్రితం జీవనోపాధి కోసం నేరేడ్‌మెట్‌కు వచ్చాడు. స్థానిక సమతానగర్‌లో ఓ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నాడు. అయితే గతనెల 28న షాపులో తనఫోన్ పెట్టి బయటకు వెళ్లిపోయాడు. ఇప్పటి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు , షాపు యజమాని అంతటా వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆదివారం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

బస్తీ దవాఖానల్లో ఓఆర్ఎస్ అండ్ జింక్ కార్నర్

- సమ్మర్‌లో జాగ్రత్తలు పాటించాలి
- అమీర్‌పేట్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ రేవతి

యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానలో వైద్య సేవలపై సూచనలు చేస్తున్న ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ రేవతి

దవాఖానలో ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ అండ్ జింక్ కార్నర్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 7: వేసవిని దృష్టిలో ఉంచుకొని బస్తీ దవాఖానల్లో ఓఆర్ఎస్ అండ్ జింక్ కార్నర్ ఏర్పాటు చేస్తున్నట్లు అమీర్‌పేట్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ రేవతి తెలిపారు. వడదెబ్బ సమస్యను మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించి తెలంగాణ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆదివారం యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానను సందర్శించి ఓఆర్ఎస్ అండ్ జింక్ కార్నర్ సేవలను ఆమె పరిశీలించారు. ఎండ వేడిమికి కళ్తు తిరగడం.. వాంతులు.. డీ హైడ్రేషన్ వంటి లక్షణాలున్న వారు బస్తీ దవాఖానల్లో ఏర్పాటు చేసిన జింక్ కార్నర్‌లో ఓరల్ రీ హైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్), ఇతర మందులతో ప్రాథమిక చికిత్స తీసుకోవాలని సూచించారు. వేసవిలో ప్రతిఒక్కరూ మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలని, వీలైతే మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. ఎండలు తీవ్రమవుతున్నందున పగటిపూట బయట తిరగవద్దని, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. ఎండ దెబ్బకు గురైన లక్షణాలు కనపడితే బస్తీ దవాఖాన, పీహెచ్‌సీల్లో వైద్యులను సంప్రదించాలని సూచించారు. అధిక శరీర ఉష్ణోగ్రతతో చెమటలు పట్టకుండా అపస్మారక స్థితిలోకి వెళ్తే 108కు కాల్ చేయాలని కోరారు.

9 నుంచి రంగస్థల నాటక మహోత్సవాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 7: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతియేటా నిర్వహించే ఉగాది రంగస్థల నాటక మహోత్సవాలను ఏప్రిల్ 9నుంచి 13వరకు ఫిలింనగర్‌లోని రామానాయుడు కళా మండపంలో నిర్వహించనున్నామని నిర్వాహకులు పొత్తూరు వెంకట సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుభాష గొప్పదనంతో పాటు నాటకరంగంపై మక్కువతో రంగస్థల నాటక మహోత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతిరోజూ రాత్రి 7గంటల నుంచి 10గంటల దాకా ప్రఖ్యాత నాటక సంస్థలు పౌరాణిక నాటకాలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. గుణనిధి, మోహినీ భస్మాసుర, బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర, యయాతి చరిత్ర నాటక మహోత్సవాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. నాటక ప్రియులు, కళాభిమానులు ఈ ఉత్సవాలను తిలకించాలని కోరారు.

సీపీఐతోనే అట్టడుగు వర్గాలకు న్యాయం

శంషాబాద్ పట్టణంలో సీపీఐలో చేరుతున్న పలువురు కార్మికులు, మహిళలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 7: సీపీఐతోనే అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి నర్ర గిరి స్పష్టం చేశారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలోని వివిధ బస్తీలకు చెందిన పలువురు కార్మికులు, నాయకులు సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా నర్ర గిరి మాట్లాడుతూ.. పేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడం కోసం తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేసి ఎంతో మందికి సొంతింటి కలను నేరవేర్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. శంషాబాద్ పట్టణంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు న్యాయమైన హక్కుల సాధనకు పోరాటాలు చేసి సాధించామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఆర్.యాదగిరి, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు అన్నపు ప్రభుముదిరాజ్, నాయకులు అనిత, రాజు, పెద్దయేసు, నర్సింహులు, బాలరాజు, శ్రీనివాసులు, మోహన్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో అధికారుల చెలగాటం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 7: విద్యార్థుల జీవితాలతో విద్యాశాఖ అధికారులు ఆడుకుంటున్నారనడానికి నిదర్శనం ఆదివారం జరిగిన ఘటనే కారణం. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ మోడల్ పాఠశాల 6వత రగతిలో ప్రవేశపరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 నుంచి పరీక్ష 12 గంటలకు వరకు పరీక్ష సమయం కేటాయించారు. అయితే హాల్‌టికెట్‌లో శంషాబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్(బాలికల) పాలమాకుల చిరునామా రావడంతో చాలా మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాలమాకులకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రం ఇక్కడ కాదని చెప్పడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఖంగుతిన్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు పాలమాకుల గ్రామానికి వచ్చిన ఎంతో మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులను శంషాబాద్‌కు పంపించారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల తప్పిదంతోనే పరీక్ష కేంద్రం చిరునామా తప్పుగా ముద్రితమైందని ఆరోపించారు. విద్యశాఖ గాడితప్పడంతోనే విద్యార్థులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని విమర్శించారు. ఈ విషయంపై అధికారుల వివరణ కోరగా హాల్‌టికెట్‌లో అడ్రాస్ తప్పుగా వచ్చిన మాట వాస్తవమే, కాని వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఐపీసీ మల్కాజిగిరి అభ్యర్థిగా నాగ ఉదయలక్ష్మి


హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేబీ శ్రీధర్

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 7: మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ (ఐపీసీ) పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షురాలు శివలంక నాగ ఉదయలక్ష్మిని బరిలో నిలుపుతున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ తెలిపారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి స్వీకరించిన సలహాలు, సూచనలకు అనుగుణంగా తమ ఎన్నికల మ్యానిఫెస్టోను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఉదయలక్ష్మిని ప్రజలు ఆదరించి ఎంపీగా గెలిపించాలని కోరారు. దేశంలోని పేదలకు విద్య, వైద్యంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వాసుదేవరావు, భాస్కర్, ఆవుల అల్లాజీయాదవ్, కొండల్‌రావు, సరిత, నవీనరాణి, నాగ భూషణం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 7: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక ఎంపీ స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని బీడీఎల్ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు దానకార్ణ చారి అన్నారు. ఆదివారం హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను మలక్‌పేట నియోజకవర్గం పార్టీ నేతలతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి కేవలం వారి సొంత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పదేండ్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో తాగు, సాగునీరు కటకట ఏర్పడిందని ఎద్దేవా చేశారు.

అల్కాపురికాలనీలో కొండా సంగీతారెడ్డి ప్రచారం

మహాత్మాగాంధీ పార్కులో వాకర్స్‌తో మాట్లాడుతున్న కొండా సంగీతారెడ్డి

మణికొండ, ఏప్రిల్ 7: తెలంగాణ ప్రజలంతా బీజేపీకి మద్దతు పలుకుతున్నారని కొండా సంగీతారెడ్డి అన్నారు. అల్కాపురి కాలనీలోని మహాత్మాగాంధీ పార్కును ఆమె ఆదివారం సందర్శించారు. తన భర్త, చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకర్స్‌తో మాట్లాడుతూ.. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నార్సింగిలో దోమలు, పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకుంటే సమస్యలు పరిష్కరించుకోవచ్చునని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మణికొండ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, ప్రధాన కార్యదర్శి కందుల శ్రీనివాస్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు అనిత, వినోద్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికనగర్ రోడ్డంతా డంపింగే..

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 7: గార్బేజ్ వనరబుల్ పాయింట్లు సమూలంగా ప్రక్షాళన చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు.. రోడ్లపై చెత్త పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఆదివారం కార్మికనగర్ రోడ్డులోని ఎస్సీటీపీ పాయింట్ వద్ద భారీగా డంపింగ్ చేయడంతో రోడ్డంతా చెత్త పేరుకుపోయింది.